# కుతుబ్ మీనార్ అమ్మబడును!

ఏ. వీ. మోహన్రావ్

"ఊఁ! చెప్పండి!" అన్నాడు సుధాకర్ గోల్డ్ ఫ్లాక్ ఫిల్టర్ సిగరెట్ వెలిగించుకుంటూ.

అతని కెదురుగా కూర్చున్న ముప్ఫయి సంవత్సరాల అందమైన యువకుడు కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు. ప్రక్కనున్న యువతివంక ఓమారు చూసి—

"నా పేరు ఈశ్వరరావు. హైదరాబాదులో ఫ్యాన్సీ షాపుంది నాకు. రెండు మాసాల క్రితం, హోటల్ బ్లూ డైమండ్‌లో ఉమాపతిని ఆకస్మికంగా కలుసుకున్నాను. అతనితోపాటు యీమె కూడా వుంది. తాను కలర్ పిక్చర్ తియ్యబోతున్నాననీ, అందులో ఈమె హీరో యిన్‌గా వేషం వెయ్యబోతుందనీ. లొకేషన్లు చూసేందుకు

హైదరాబాదు వచ్చానని చెప్పాడు ఉమాపతి. నాకు ఆరాటం కలిగింది. నాకు హీరో వేషం ఇవ్వమని అడిగాను. ఆలోచించి చెపుతానన్నాడు. తర్వాత నాలుగు రోజులు అతని చుట్టూ తిరిగాను. ఏమాటా తెగేసి చెప్పలేదు. ఐదో రోజు హీరో వేషం ఇస్తానన్నాడు. నా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి'' ఆగాడు ఈశ్వరరావు.

"చెప్పండి!'' కళ్ళు మూసుకునే ప్రోత్సహించాడు డిటెక్టివ్ సుధాకర్.

"ఈమెతో నన్ను ఖుషీగా తిరగమన్నాడు. ఇద్దరం సినిమాలో ప్రేయసీ ప్రియులుగా నటించాలి కాబట్టి ఒకర్నొకరం అర్థం చేసుకోవటంవల్ల ఏ విధమైన బెరుకు లేకుండా నటించగలుగుతామని చెప్పాడు ఉమాపతి. నాకు రెండు వేలిచ్చాడు. నేనూ ఈమె, హైదరాబాదంతా తెగ తిరిగాం. అతను ఎక్కడెక్కడికో వెళ్ళి వస్తుండేవాడు. డబ్బు మాత్రం చిత్తు కాగితాల్లా తీసి ఖర్చు పెట్టేవాడు. నెలరోజులు జరిగిపోయాయి.

ఒకరోజు ఉన్నట్టుండి నన్ను కూర్చోబెట్టుకొని, తను తీయదల్చుకున్న సినిమా పని ప్రారంభించేందుకు మరో ఆరు మాసాలు పట్టవచ్చునని, ప్రస్తుతం పని జరిగే అవకాశాలు లేవని అన్నాడు. ఎందువల్లనని అడిగాను. పంపిణీదారులు ఇచ్చే పది లక్షలు కాకుండా, తను రెండు లక్షలు పెట్టుబడి పెట్టవలసి వుందనీ, అందులో సగం మాత్రం ప్రస్తుతం వుందనీ, మిగిలింది అందటం ఆలస్యమవుతుందనీ చెప్పాడు.

నా జీవితాన్ని బంగారు బాటవైపు త్రిప్పే అవకాశం చేజారి పోతున్నందుకు బాధ కలిగింది. అతని అంచనాల

ప్రకారం కనీసం పాతిక లక్షలు లాభం రావచ్చని చెప్పి వున్నాడు.

ఆలోచించి నిర్ణయానికి వచ్చాను. షాపు అమ్మేశాను. లక్ష తెచ్చాను. తీసుకొని సగం భాగం ఇమ్మన్నాను. అతను ఒప్పుకోలేదు. తొంభై వేలు తీసుకొని నలభై అయిదు పైసలు భాగం ఇస్తానన్నాడు. అలా చేసినందువల్ల మేనేజిమెంటు తన చేతిలో వుంటుందనీ, అది ముఖ్యమనీ అన్నాడు.

నేను అభ్యంతర పెట్టలేదు. పార్ట్‌నర్ షిప్ డీడ్ రాయించాడు. ఇద్దరం సంతకాలు చేశాం. విజయవాడ వెళ్ళి రెండ్రోజుల్లో వస్తానన్నాడు అంతే అంతూ పంతూ లేకుండా పోయాడు. విజయవాడ వెళ్ళి వాకబు చేశాను. ఉమాపతిని గుర్తుపట్టే వాళ్ళే చిక్కలేదు. మద్రాసు వెళ్ళాను. అతను చెప్పినలాంటి కంపెనీ ఏదీ అక్కడలేదు. అతను ఇచ్చిన అడ్రసులో పెళ్ళిళ్ళు చేసుకొనే కల్యాణ మండపం వుంది. తిరిగి వెళ్ళి ఈమెను పట్టుకొన్నాను" చెప్పటం ఆపాడు ఈశ్వరరావు.

"నీ పేరేమిటమ్మాయి?"

"సునంద!"

"నీకు ఉమాపతి ఎన్ని రోజులనుండి తెలుసు?"

"దాదాపు రెండు మాసాలనుంచి తెలుసు!"

"అతనితో మొదటి పరిచయమెలా జరిగింది?" అడిగాడు సుధాకర్.

"వాహినీ స్టుడియోలో నేనూ, మరికొంతమంది ఒక సినిమాలో డ్యాన్సు చేసేందుకు వెళ్ళాం. ఆ సెట్‌లో మేకప్‌లో తిరిగే నన్ను చూశాడు ఉమాపతి. ఆ సినిమా

డైరక్టరుతో మాట్లాడేందుకొచ్చాడట. నన్ను చూడగానే హీరోయిన్ వేషం వేస్తారాని అడిగాడు. ఎగిరి గంతేశాను. కారెక్కించుకొని తీసుకెళ్ళాడు తను బసచేసిన వుడ్‌లాండ్స్ హోటల్‌కు. అప్పట్నుంచి అతనితోనే వున్నాను'' అంది సునంద.

''అతనికోసం ఎవరన్నా వచ్చేవాళ్ళా?''

''ఎవ్వరూ రారు. తనే వెళ్ళి వస్తుండేవాడు.''

''డబ్బు బాగా వుందా అతనివద్ద!''

''ఏమో? లెక్క లేకుండా ఖర్చు పెట్టేవాడు.''

''అతను మాట్లాడిన డైరక్టరు పేరేమిటి?''

''శ్రీనివాసరావు!'' చెప్పింది సునంద.

ఉమాపతి అసలు పేరయి వుండేందుకు వీలులేదనిపించింది సుధాకర్‌కు. అతను ఎవరో కానీ, అఖండుడులా తోచింది. నెలరోజుల్లో తొంభై వేలు సులభంగా చేజిక్కించుకో గలగటం చిన్న విషయం కాదు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెట్టినట్లు సునంద చెప్పిందాన్నిబట్టి, అతనివద్ద అంతకుముందు కనీసం ఓ పాతిక వేలన్నా వుండి వుండాలనుకున్నాడు.

చెయ్యి తిరిగిన పాత నేరస్థుడు కాకుంటే అతనివద్ద డబ్బు వుండే అవకాశంలేదు. అదీగాక ఇంత పకడ్బందీగా ప్లాను వేశాడంటే, సామాన్యుడు కాడనిపించింది.

''ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?'' అడిగాడు సుధాకర్.

''నా జీవితం నాశనం అయింది. తింటానికి తిండి కూడా లేదు. అతన్నెలాగైనా పట్టుకోవాలి మీరు. నా డబ్బు నాకు దక్కే ఏర్పాట్లు చెయ్యాలి. మీకు ఫీజు

ఇచ్చే అవకాశం కూడా లేదు. అతను చిక్కి, ఆ డబ్బు తిరిగొస్తే అందులోంచి సగం మీ ఫీజు క్రింద తీసుకోండి!'' అన్నాడు ఈశ్వరరావు కన్నీళ్ళు తుడుచుకుంటూ.

''ఉమాపతి ఫోటో ఏదైనా వుందా?''

''లేదు!''

''అమ్మాయి సునందా? అతనికి స్త్రీలంటే బలహీనత వుందా?''

''అలాంటిదేమీ వున్నట్లు లేదు. అతనితో అన్నిరోజు లున్నాను ఒంటరిగా. ఒక్కసారన్నా నన్ను తాకలేదు. నాకు నేనే చాలాసార్లు అతన్ని ఆకర్షించాలనీ, ఎలాగైనా నాకున్న సర్వస్వం అర్పించాలనీ, ప్రయత్నించాను. అతను నా జోలికి రాలేదు. ఒకనాడు నగ్నంగా గదిలో నిలబడి, అతను తలుపు తట్టగానే తీశాను. నా ఆకారం చూచి, కళ్ళు మూసుకొని డ్రెస్ చేసుకుంటున్నావా! సారీ! అంటూ ప్రక్క గదిలోకి వెళ్ళిపోయాడు'' చెప్పింది సునంద.

''తాగుతాడా?''

''ఆఁ! ఖరీదైన డ్రింకులు తెచ్చుకొని తాగుతాడు!''

''నువ్వూ అతనితో తాగేదానివా?''

''నన్ను పిలిచేవాడు కాదు. తనే ఒంటరిగా గదిలో కూర్చుని తాగేవాడు!''

సుధాకర్ ఎన్నో ప్రశ్నలు వేశాడు ఆగంతకుణ్ణి గురించి ఏదైనా ఆచూకీ చిక్కుతుందేమోనని. ఆమె ప్రతిదానికీ 'తెలీదు', 'తెలీదు' అనే చెప్పటంతో విసుగెత్తి విరమించు కున్నాడు.

ఈశ్వరరావు దగ్గరా, సునందవద్దా అడ్రసులు తీసుకొని

చేతనయిన ప్రయత్నం చేస్తానని చెప్పాడు.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

ఉమాపతిని గురించే ఆలోచించసాగాడు. అతను ఈ నేరాన్ని ప్లాన్ చేసిన తీరూ, అమలు జరిపిన పద్ధతీ, అతనికి విచిత్రంగా తోచింది. అతను క్రిమినల్ జీనియస్. లేకుంటే అన్నాళ్ళు వీళ్ళతో తిరిగి, తన్ను పట్టించే ఏ విధమైన ఆధారం వాళ్ళకు దొరక్కుండా జాగ్రత్త పడడమనేది అసాధ్యం. అతన్ని ఎలా పట్టుకోవటమన్న ఆలోచనలో పడ్డాడు.

సులభంగా డబ్బు సంపాదించే మార్గాలు తెలుసుకొన్న మనిషి, డబ్బును అంతకన్నా సులభంగా, విచ్చలవిడిగా ఖర్చుపెడుతూండటం పరిపాటి. అతను సంపాదించిన తొంభైవేలు నెల దినాలికన్నా ఎక్కువ రావు. అయితే ఈ లోగానే ఉమాపతి మరో నేరం చెయ్యడానికి తయారు కావాలి. అప్పుడు తను పట్టుకొనే వీలుంటుం దేమోనన్న ఆశ కలిగింది.

కానీ ఆ నేరం ఎక్కడ చేస్తాడు? ఎలా చేస్తాడు? అన్నది తెలియాలి!

కణతలు నొప్పి పుట్టాయి. ఆలోచించడం మాను కున్నాడు సుధాకర్.

## 2

పాలం విమానాశ్రయంలో ఆగింది విమానం.

సుధాకర్ దిగి వెలుపలికొచ్చాడు. అతనికోసం సిద్ధంగా వున్న ఇంఫాలా కారెక్కి, హిల్టన్ హోటల్‌కు చేరు కున్నాడు.

ఢిల్లీలో అంతర్జాతీయ నేర పరిశోధనకు సంబంధించిన

మహాసభలు జరుగుతున్నాయి. వాటిల్లో ప్రసంగించడానికి, భారత ప్రభుత్వం తరఫున డిటెక్టివ్ సుధాకర్ నియమించబడ్డాడు. ఆ సందర్భంగానే ఢిల్లీకి వచ్చాడు సుధాకర్.

మొదటి రెండు రోజులూ క్షణం తీరిక లేకుండా పోయింది. రెండో రోజు రాత్రి గదికి తిరిగొచ్చేసరికి అర్థరాత్రి పన్నెండు గంటలయింది. మెయిన్ డోర్ వారగా పడున్న చిన్న చీటి తీసి చూశాడు. అందులో ఇంగ్లీషులో రాసివున్న నాలుగు వాక్యాలు చదివాడు. తనకు తీరిగ్గా వున్నప్పుడు ఆ హోటల్లోనే వున్న ఆరొందలా అరవై ఆరో నెంబరు గదికి ఫోన్ చేసి చెప్తే, వెంటనే వచ్చి కలుసుకుని మాట్లాడుతాననీ, చాలా అర్జంటనీ రాసి క్రింద 'డేవిడ్' అని సంతకం చేసి వుంది.

ఆ పేరుగల మనిషెవరన్నా తనకు తెలుసునేమోనని జ్ఞాపకాలు నెమరు వేసుకున్నాడు. ఎప్పుడూ అలాంటి పేరున్న మనిషిని కలుసుకున్నట్లు గుర్తురాలేదు.

ఆ డేవిడ్ కు తనతో అర్జంటు పనేమయి వుంటుందాని కొంతసేపు ఆలోచించాడు. తను ఢిల్లీలో వున్న విషయం తెలుసుకొని, కలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడంటే ఏదో పెద్ద అవసరమే వుండి వుండాలనిపించింది.

తెల్లవారిందాకా ఆగుదామనుకున్నాడు. మళ్ళీ నిద్ర లేచేసరికి ఆలస్యమవుతుందన్న అనుమానంతో ఫోన్ తీసి "రూం నెంబరు ట్రిబుల్ సిక్స్" అన్నాడు.

"ఒన్ సెకండ్!" అంది రిసెప్షనిస్టు.

వెంటనే "హల్లో! ఎవరు?" అంటూ బొంగురు గొంతు వినిపించింది.

"డిటెక్టివ్ సుధాకర్! డేవిడ్ మీరేనా?" అడిగాడు.

"ఆఁ! థాంక్స్ ఫర్ ది ప్రాంప్ట్ రెస్పాన్స్. రమ్మంటారా?" అడిగాడు డేవిడ్ అవతలివైపునుండి.

"రండి!" అంటూ ఫోన్ పెట్టేశాడు.

పది నిముషాల తర్వాత తలుపు తట్టిన చప్పుడయింది. వెళ్ళి తలుపు తీశాడు సుధాకర్.

"డేవిడ్!" అన్నాడు తనేనన్నట్లు.

"కమిన్!" అంటూ లోనికి దారితీశాడు సుధాకర్.

ఇద్దరూ కూర్చున్నారు. సుధాకర్ సిగరెట్ వెలిగించుకున్నాడు.

"ఏమిటంత అర్జంటు!" అడిగాడు డేవిడ్ను.

"ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. దాదాపు లక్ష రూపాయులు నష్టపోయాను. నేను నిజంగానే పోగొట్టుకొన్నానా లేక మోసపోయానా అన్న విషయం తేల్చుకోవాలి. మోసపోయి వుంటే నన్ను ఇంత సులభంగా బోల్తా కొట్టించిన ఆ రాస్కెల్ను మీరు పట్టి పోలీసులకు అప్పగించాలి!"

అతనా మాట అనగానే సుధాకర్కు మద్రాసులో విన్న ఈశ్వరరావు కేసు గుర్తుకొచ్చింది. అది జరిగి నెల పైన ఆరురోజు లయింది.

"అసలింతకు జరిగిందేమిటో వివరంగా చెప్పండి!" అడిగాడు సుధాకర్.

"నేనీ హోటల్లో దిగి పదిహేను రోజులయింది. నా భార్యతో కూడా వచ్చాను. నా కిక్కడో రెండు వ్యాపారాలున్నాయి. వాటి లెఖలు అవీ చూద్దామని వచ్చాను. నా గదికి ఎదురుగా వున్న గదిలో ఒకతను దిగాడు. ఎప్పుడూ టిప్టాప్గా డ్రెస్ చేసుకుని తిరిగే

వాడు. ఇంఫాలా కారొకటి అద్దెకు తీసుకుని వాడు తుంటూండం కూడా గమనించాను. అక్కడక్కడా, అప్పుడప్పుడూ ఇద్దరం కలిసేవాళ్ళం. ఒకరోజు అతని వ్యాపారం గురించి అడిగాను. ఏం లేదన్నాడు. తాతతండ్రులు సంపాదించిన ఆస్తి హారతి కర్పూరంలా అరగదీస్తున్నాడేమో ననుకునీ, అదీ అడిగాను. కాదన్నాడు. మరి ఎలా ఇంత ఆర్భాటంగా ఖర్చుపెడుతున్నావ్ అని అడిగాను. తెలుసుకోవాలనుకుంటే రూంకు రమ్మన్నాడు ఆ రాత్రి!'' చెప్పడం ఆపాడు డేవిడ్.

జేబులోంచి సిగర్ తీసి నోట్లో పెట్టుకోబోతూ ఆగి ''మీకు అభ్యంతరం లేకుంటే...'' అంటూ ఆగాడు.

''కాల్చండి! ఫరవాలేదు!'' అన్నాడు సుధాకర్.

డేవిడ్ సిగర్ కాల్చుకున్నాక మళ్ళీ చెప్పటం మొదలెట్టాడు.

''అతని రూంకు వెళ్ళాను. ఒక డజను వాట్ సిక్స్టీ నైన్ బాటిల్స్ వున్నాయి. నాలుగు వందరూపాయల కట్టలు బెడ్ మీద పడున్నాయి. చూచి మతిపోయింది నాకు. ఎలా సంపాదిస్తున్నావ్ అని అడిగాను.

అతని మాటల కడ్డొస్తూ ''ఓమారు అతను ఎలా గుంటాడో చెప్పగలరా?'' అడిగాడు సుధాకర్.

''నాకన్నా నాలుగు అంగుళాలు పొడవు తక్కువుంటాడు. తల కొద్దికొద్దిగా తెల్లబడినట్లుంది. వెంట్రుకలు పైకి దువ్వుకుంటాడు. రిమ్‌లెస్ కళ్ళజోడు పెట్టుకుంటాడు. మీసం లేదు. ముక్కు ముఖానికి అతికించినట్లు కాస్త పెద్దదిగా ఉంటుంది. కుడివేపు రంధ్రంగూడా వుంది. అంత లావూ కాదు. సన్నమనీ అనుకోలేము. మధ్యంత

రంగా వుంటాడు" వర్ణించాడు డేవిడ్.

ఈశ్వరరావు చెప్పిన పోలికలు కొన్ని కనుపించాయి. ఆ వర్ణనలో సుధాకర్‌కు.

"అతని పేరేమన్నాడు?"

"ఉమాకాంతం అన్నాడు!"

ఉమమీద ఇతనికి ఎక్కువ ఇష్టంలాగుందనిపించింది సుధాకర్‌కు.

"చెప్పండి!" అంటూ కుర్చీలో వెనక్కి వాలి కూర్చున్నాడు డిటెక్టివ్ సుధాకర్.

"కూర్చున్నాక గ్లాసులో విస్కీ పోసి ఇచ్చాడు. అందుకొని అసలు విషయం అడిగాను. నవ్వి డబ్బు సంపాదించడం చాలా సులభమన్నాడు. వివరంగా చెప్పమన్నాను. గుర్రప్పందాలు ఆడతాడట. ఢిల్లీలో ఆఫ్‌కోర్సు బెట్టింగుంది. ఏ రేసులో ఏ గుర్రం నెగ్గేది తనకు ముందే తెలుస్తుందట. దానిపైన పదివేలు వేస్తాడట. అది ఆరు రెట్లో, ఏడు రెట్లో పే చేస్తుందిట. అలా మీటింగ్ వున్న ప్రతిరోజూ ఒక లక్ష సంపాదిస్తున్నానని చెప్పాడు."

"అతనికెలా తెలుస్తుందట విన్నింగ్ హార్స్!" అడిగాడు సుధాకర్.

"పందాలు జరిగే చోటునుంచి టెలిఫోన్ ద్వారా రిజల్ట్సు వస్తాయి ఢిల్లీకి. ఎక్స్ఛేంజిలో ఉమాకాంతం స్నేహితుడు పని చేస్తున్నాడట. కాల్ రాగానే మధ్యలో క్షణకాలం ఆపి, ఉమాకాంతంకు చెప్పి, ఆ తర్వాత ఆఫ్‌కోర్స్ బెట్టింగులు నడిపే కంపెనీకి కనెక్షన్ ఇస్తాడట. వాళ్ళకు వార్త తెలిపేలోగా ఉమాకాంతం తక్కువ వెళ్ళి టిక్కెట్లు కొంటాడట!" చెప్పాడు డేవిడ్.

"తర్వాతేమయింది?"

"అతని మాటలు నమ్మలేకపోయాను. కానీ మరుసటి దినం అతని ఫ్రెండును హోటల్‌కు పిలిపించి నాకు పరిచయం చేశాడు. ఆరోజు నన్ను వెంటతీసుకెళ్ళి నా పేరు మీద తనే వెయ్యిరూపాయలు కట్టాడు. అది ఆరువేలు పే చేసింది. ఆ డబ్బు నాకే ఇచ్చాడు. నా కళ్ళముందే అతనికి ఫోన్ వచ్చింది. నేనే రిసీవరు తీసుకున్నాను. గుర్రం పేరు విని అతనికి చెప్పిందికూడా నేనే. దానిమీద వెళ్ళి డబ్బు కట్టివచ్చాను. అందువల్ల నాకు ఏ విధమైన అనుమానం లేకుండా పోయింది. నా వ్యాపారాలు నష్టంలో వున్నాయి. వాటిని మళ్ళా బాగుపరచాలంటే నాలుగు లక్షలు కావాలి. అది సంపాదించేందుకు ఉమాకాంతం తప్ప నాకు మరోదారి లేదనిపించింది. మరుసటి దినం వెళ్ళి అతన్ని బ్రతిమిలాడాను. అతను అంత పెద్ద మొత్తంతో ఆడితే అనుమానం వస్తుందనీ, తన ఫ్రెండ్ కూడా పెద్దభాగం అడుగుతాడనీ చెప్పాడు. నాకు కావలసింది చెప్పి, ఎలాగైనా నాలుగు లక్షలు సంపాదించి పెట్టమన్నాను. అందుకు పెట్టుబడిగా లక్షరూపాయలు తెచ్చి ఇస్తానన్నాను. ఆలోచించి చెపుతానన్నాడు!" ఆగాడు దేవిడ్ చెప్పకుండా. సిగర్ తీసి ఆష్ట్రేలో పెట్టి నలిపాడు.

"ఆ తర్వాత రెండ్రోజులు అతని చుట్టూ తిరిగాను. తలచుకొంటే, సిగ్గూ, కోపం, అవమానం వస్తున్నాయి ఇప్పుడు. మూడోరోజు అయిష్టంగానే ఒప్పుకున్నాడు. అతని చేతికి లక్షరూపాయలిచ్చాను. వారం తర్వాత వచ్చి లెక్కలు చూసుకుని రావలసిన డబ్బు తీసుకువెళ్ళమని

చెప్పాడు, సరేనని వచ్చేశాను. మరుసటి దినం నాకు ఉమాకాంతం కనుపించలేదు. పనిమీద తిరుగుతున్నా డనుకున్నాను. రెండో రోజూ అంతే అయింది. హోటల్ వాళ్ళను అడిగితే రూం ఖాళీ చెయ్యలేదని చెప్పారు. అతని ఫ్రెండు దగ్గరకు వెళ్ళాను, ఉమాకాంతం ఏం చేస్తున్నాడో ఏ మాత్రం గెలిచాడో తెలుసుకుందామని. అక్కడ అతను లేడు. పేరు చెప్పి అడిగాను. అలాంటి పేరుగల మనిషి అక్కడెప్పుడూ పని చెయ్యలేదని చెప్పారు. అప్పుడు తెలిసింది నేను మోసపోయినట్లు..." అన్నాడు డేవిడ్ అద్దాలు తీసి జేబురుమాలుతో కళ్ళు తుడుచుకుంటూ.

సుధాకర్ ఏం మాట్లాడలేకపోయాడు, అతని బాధ చూచి.

"నా భార్యకు ఈ గొడవ తెలీదు! నేను పూర్తిగా మునిగిపోయాను. అతన్నెలాగైనా మీరు పట్టుకోవాలి! నా డబ్బు నాకు తిరిగివచ్చేట్లు చూడాలి!" అన్నాడు డేవిడ్.

ఈ ఉమాలోలుడు ఎవరోగానీ, జనాన్ని సులభంగా బోల్తా కొట్టిస్తున్నా డనుకున్నాడు సుధాకర్. అతని టెక్నిక్కు మనసులోనే జోహారు లర్పించాడు. ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు, అవతలివాడి బలహీనత, అవసరం తెలుసుకొని, దానికి తగ్గ ప్లాను వెయ్యడంలో అతను చూపిస్తున్న నేర్పు అపరిమితంగా కనుపించింది. అంత తెలివైన నేరస్థుడు బహుశా తనకు తగలటం ఇదే మొదటిసా రనిపించింది. ఎలాగైనా ఈ ఉమాలోలుణ్ణి, పట్టుకుని తీరాలన్న పట్టుదల ఏర్పడింది లోలోపల సుధాకర్కు.

"ప్రయత్నిస్తాను! అయినా మీరు ఇంత వయస్సు వచ్చి, ఇంత జీవితం చూచి, సులభంగానూ, అయాచితంగానూ, అంత డబ్బు సంపాదించా లనుకోవడమన్న అవివేకం వల్లనే ఈ అనర్థం జరిగింది!" అన్నాడు సుధాకర్.

"తెలుసు బాబూ! తెలుసు! నా తప్పు నాకు తెలుసు. మొదట్నుంచి కష్టించి పనిచేసినవాణ్ణి. బుద్ధి గడ్డి తిన్నందుకు మంచి శాస్తే జరిగింది!" అన్నాడు డేవిడ్.

"ఇక మీరు వెళ్ళండి! నాకు చేతనయినదంతా చేస్తాను. ఆతర్వాత మీ అదృష్టం!" అని చెప్పి డేవిడ్‌ను సాగనంపి, తలుపులు మూసి, గొళ్ళెంపెట్టి వచ్చి పడుకున్నాడు.

హైదరాబాద్ నుండి, ఢిల్లీకి తేలిన ఉమాకాంతం, ఏ రూపమెత్తి, ఏ వూర్లో వున్నాడో, తెలిస్తే బాగుండు ననుకుంటూ లైట్ ఆఫ్ చేసి పడుకున్నాడు సుధాకర్.

# 3

తెల్లవారింది.

సుధాకర్ కాలకృత్యాలు తీర్చుకుని, డ్రెస్ చేసుకున్నాడు.

'రూం సర్వీస్'కు ఫోన్ చేసి బ్రేక్‌ఫాస్ట్ తెప్పించుకుని తిన్నాడు.

తిన్నగా సి. బి. ఐ. ఆఫీసుకు వెళ్ళాడు.

డైరక్టరు మెహతాను కలుసుకుని ఉమాపతి వురఫ్ ఉమాకాంతం చేసిన నేరాల వివరాలు చెప్పి, అతని రూపురేఖ విలాసాలు వివరంగా రాసిచ్చి, వాళ్ళ రికార్డుల్లో అటువంటి పాత నేరస్థుడెవరన్నా దొరుకుతాడేమో చూడమని కోరాడు.

మెహతా నాల్రోజులు టైము కావాలని చెప్పాడు.

మద్రాసుకు ఫోన్ చేసి చెప్తానని ప్రామిస్ చేశాడుకూడా మెహతా.

సుధాకర్ అంటే అతనికి చాలా గౌరవం. ఇద్దరూ కలసి నాలుగైదు కేసులు పరిశోధించి ఫలితాలు సాధించారు. అంతకుముందు ప్రభుత్వం తరఫున ఏదైనా అవసరం వుంటే, ఎన్ని పనులున్నా మానుకుని వచ్చి సహాయపడుతుంటాడు సుధాకర్.

సి. బి. ఐ. ఆఫీసునుంచి తిన్నగా ఆఫ్ కోర్సు బెట్టింగ్ లు నడిపే "జంజీరా ఎంటర్ ప్రైజెస్" ఆఫీసుకు వెళ్ళాడు.

కార్డు లోపలకు పంపగానే రమ్మని కబురు తెచ్చాడు బాయ్. వెళ్ళి మానేజింగ్ డైరక్టర్ లాల్ యెదురుగా కూర్చున్నాడు సుధాకర్.

"మిమ్మల్ని గురించి విన్నాను. ఇవాళ చూచే అదృష్టం కలిగింది" అన్నాడు లాల్ కరచాలనం చేస్తూ.

సుధాకర్ నవ్వుతూ తను వచ్చినపని వివరంగా చెప్పి "అలా ఇన్ ఫర్ మేషన్ మధ్యలో టాప్ చేసి, మీ కంపెనీ నుండి లక్షలు రాబట్టుకున్న విషయం మీకు తెలుసా?" అడిగాడు.

"ఇంపాజిబుల్! అలా జరగడానికి అవకాశమే లేదు!" అన్నాడు లాల్.

"కానీ జరిగింది. అందుకు సాక్ష్యులుకూడా వున్నారు!" సుధాకర్ బల్లగుద్ది చెప్పాడు.

"సుధాకర్ గారూ! ప్రస్తుతం రేసులు బెంగుళూరులో జరుగుతున్నాయి. రేస్ ప్రారంభించేది అక్కడ 3 గంటల కనుకోండి. వాళ్ళు అంతదాకా టిక్కెట్లు అమ్ముతూనే వుంటారు. అలాగే బుకీలు కూడా బెట్టింగ్స్ తీసుకుంటూ

వుంటారు. కానీ మేము ఇక్కడ రెండు గంటలా ఏభై నిముషాలకే కిటికీలు మూసేస్తాం. ఒకవేళ మధ్యలో ఇన్ ఫర్మేషన్ టాప్ చేసినా వాళ్ళకు ప్రయోజనం వుండదు" అన్నాడు లాల్.

"రేసు జరిగాక ఎంత సేపటికి మీకు రిజల్టు తెలుస్తుంది."

"ఐదు నిముషాలకు. అంటే మూడూ ఐదు కనుక్కోండి" అన్నాడు లాల్.

సుధాకర్ కు డేవిడ్ చెప్పిందానికీ, లాల్ చెప్పిందానికీ తేడా కనుపించింది. ఆ మాత్రం జాగ్రత్త తీసుకోకుండా అందులోనూ జూదంతో గూడిన వ్యాపారం ఎవ్వరూ చెయ్యరు. లాల్ చెప్పేది నిజమైతే డేవిడ్ ఎలా మోస పోయాడు.

అక్కడింక తెలుసుకోవలసిన వివరాలేమీ లేవనిపించింది. లాల్ దగ్గర శలవు పుచ్చుకుని వెలుపలకొచ్చాడు. తిన్నగా ఢిల్లీ టెలిఫోన్ ఎక్స్ఛేంజికి వెళ్ళాడు. సబ్-డివిజనల్ ఆఫీసర్ను కలుసుకున్నాడు. ఇన్ ఫర్మేషన్ ట్యాప్ చెయ్యడం గురించి అడిగాడు. అతను అలాంటివి జరిగే అవకాశం లేదని చెప్పాడు. డేవిడ్ చెప్పిన పేరు గల వ్యక్తి అతని క్రింద పని చెయ్యటాన్ని గురించికూడా అడిగాడు.

ఇంటర్ కాన్ లో నాలుగైదు సెక్షనులకు ఫోన్ చేసి, అలాంటి పేరుగల మనిషి పనిచెయ్యడం లేదని చెప్పాడు.

అతనికి థాంక్స్ చెప్పి వెలుపలకొచ్చి కారెక్కి, హోటల్ కు పోనిమ్మన్నాడు.

రూం చేరగానే డేవిడ్ కు ఫోన్ చేసి రమ్మన్నాడు. ఐదునిముషాల తర్వాత వచ్చాడు డేవిడ్.

"టెలిఫోన్ కాల్ వచ్చాక డబ్బు ఎవరు కట్టారు బెట్టింగ్ విండోలో?" అడిగాడు సుధాకర్.

"నేనే!"

"అప్పటికి వాళ్ళు మూసేశారా కిటికీలు!"

"ఆఁ!"

"అయితే ఎలా కట్టావు?"

"అక్కడకూడా ఒకతన్ని మంచి చేసుకున్నాడు ఉమాకాంతం. అతనికి సైగ చేయగానే వెలుపలికొచ్చి డబ్బు తీసుకుపోయాడు. ఆ తర్వాత గెలిచిన డబ్బుతో సహా అతనే తెచ్చిచ్చాడు."

"ఆ వ్యక్తిని చూస్తే ఇప్పుడు గుర్తు పట్టగలవా?"

"గుర్తు పట్టగలను!" అన్నాడు డేవిడ్.

"ఐతే రెండు గంటలకు నా దగ్గరకు రా! తీసుకెళ్తాను. అతనిద్వారా ఉమాకాంతం వివరాలు తెలుస్తాయేమో చూద్దాం!" అన్నాడు సుధాకర్.

"అలాగే!" నని వెళ్ళిపోయాడు డేవిడ్.

సుధాకర్ భోంచెయ్యబోతూ మద్రాసుకు ట్రంకాల్ బుక్ చేశాడు. గంట తర్వాత కనెక్షను దొరికింది.

అసిస్టెంటు వసంత మాట్లాడింది. అక్కడేం విశేషాలు లేవని చెప్పింది. ఉమాకాంతం వివరాలు చెప్పి, "అలాంటి మనిషెవరన్నా మద్రాసులో వున్నాడేమో కాస్త వెతకమని పోలీస్ కమీషనర్‌కు చెప్పు. నేనొచ్చి ఆయనతో మాట్లాడుతాను" అన్నాడు సుధాకర్.

"అలాగే బాస్!" అంది వసంత.

ఫోన్ క్రేడిల్ చేసి, భోజనంచేసేందు కుపక్రమించాడు. అతని ఆలోచనల నిండా ఉమాకాంతమే వున్నాడు.

టెలిఫోన్ చేసిన మనిషీ, బెట్టింగు డబ్బు తెచ్చిచ్చిన మనిషీ, అతనితో ఎప్పుడూ వుండేవాళ్ళా, లేక ఇక్కడి కిక్కడ వాళ్ళకు డబ్బిచ్చి కుదుర్చుకుని వుంటాడా అన్నది అర్థం గాలేదు.

రోజు కొక పట్టణంలో నేరాలుచేసే ఉమాకాంతం, పర్మనెంటుగా వెంట ఎవ్వరినీ వుంచుకోడన్న అనుమానం కలిగింది.

భోజనం చేశాక, కాసేపు రెస్టు తీసుకున్నాడు. అంతలోనే గంట రెండయింది. డేవిడ్ టైం ప్రకారం వచ్చాడు. అతన్ని వెంటబెట్టుకుని 'జింజీరా ఎంటర్ ప్రైజెస్' వద్దకు వెళ్ళాడు. అక్కడ పనిచేసే వాళ్ళందర్నీ పెరేడ్ చేయించాడు ఆ కంపెనీ యం. డి. అందర్నీ చూశాడు డేవిడ్. ఎవ్వరూ అతనికి తెలిసినవాళ్ళు లేరు.

"వీళ్ళలో లేడా ఆ మనిషి?" అడిగాడు యం. డి.

"లేడు సార్!" చెప్పాడు డేవిడ్.

"ఉండేందుకు వీలులేదు. అంతా మా దగ్గర పదేళ్ళ నుంచీ నమ్మకంగా పనిచేస్తున్నవాళ్ళే!" అన్నాడు యం.డి.

ఆయనకు థాంక్స్ చెప్పి, ఇద్దరూ వెలుపలికొచ్చి కారెక్కారు.

హిల్టన్ హోటల్ లో ఉమాకాంతం రూంనుంచివచ్చిన టెలిఫోన్ కాల్స్ గురించి వాకబు చేశాడు. విజయవాడలో వెయ్యినీ రెండువందలా అరవై మూడు నెంబరుకు రెండు కాల్స్ బుక్ చేసి వున్నాయి. నెంబరు ప్రక్కన 'పి.పి. ఉమ' అని కూడా ఎంటర్ చేసివుంది.

ఆ వివరాలు డైరీలో నోట్ చేసుకున్నాడు సుధాకర్.

# 4

బేగంపేట విమానాశ్రయంలో ఆగింది కారవెలీ విమానం. డిటెక్టివ్ సుధాకర్ బ్రీఫ్ కేస్ తీసుకొని క్రిందికి దిగి పాసెంజర్ లాంజ్ వైపు వచ్చాడు. జనాన్ని తప్పుకొని పోర్టికోలోకి వచ్చి చూశాడు.

పోలీస్ కారు సిద్ధంగా వుంది.

అసిస్టెంటు కమిషనర్ దొరై విష్ చేశాడు. సుధాకర్ ప్రతినమస్కారం చేశాక, ఇద్దరూ కారెక్కారు.

"బెనర్జీ వున్నారా?" అడిగాడు కమిషనర్ను గురించి సుధాకర్.

"లేరు సార్. బొంబాయి వెళ్లారు."

"అరే! ఉంటాడనుకున్నాను. నా మెసేజ్ అందిందా?"

"రాత్రి చెప్పాను ఫోన్లో. ఈవేళ వస్తామన్నారు. వచ్చిందాకా మిమ్మల్ని వుండమని చెప్పారు" అన్నాడు దొరై.

"అలాగే వుంటాను. నన్ను బ్లూ డైమండ్ తీసుకెళ్ళండి!" అన్నాడు సుధాకర్.

"మా హాస్టల్లో రూం రిజర్వు చేయించాను!"

"వద్దు! నాకో చిన్న కేసు తగిలింది" అన్నాడు సుధాకర్.

బ్లూ డైమండ్లో రూం తీసుకున్నాడు. మేనేజర్ని పిలిపించి ఈశ్వరరావును మోసంచేసిన ఉమాపతి గురించి అడిగాడు. అతను సంతకం చేసిన రిజిస్టరు తెప్పించి చూశాడు. మద్రాసునుండి వచ్చినట్లు, వ్యాపారం చేస్తున్నట్లు, హైదరాబాదునుంచి కలకత్తా పోదలచుకున్నట్లు

నమోదయివుంది అందులో.

అతని రూం నెంబరు తాలూకు అకౌంట్ పుస్తకం తెప్పించి చూశాడు. అందులో అతనికి విజయవాడ టెలిఫోన్ నెంబరు కనుపించింది. ఉమ పేరుతో రెండు పి.పి.లు బుక్ చేసి వున్నాయి. రెండింటికీ మూడు నిముషాలు మాత్రమే మాట్లాడినట్లు బిల్ చేసి వుంది.

ఉమాపతిని పట్టుకునేందుకు అంతకన్నా మరో ఆచూకీ ఏదీ చిక్కలేదు. ఆ రాత్రికి విజయవాడ వెళ్ళి ఆ ఉమను కలుసుకోవాలని తీర్మానించుకున్నాడు.

సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో ఫోన్ మ్రోగింది.

రిసీవరెత్తి "హల్లో" అన్నాడు సుధాకర్.

"నేను భాయ్. బెనర్జీని!" అన్నాడు పోలీస్ కమీషనర్.

"ఎక్కడున్నావ్?"

"ఇక్కడున్నాను. ఇంతకుముందే వచ్చాను. నీతో అర్జంటుగా మాట్లాడాలి! మరో అరగంటలో వస్తున్నాను" అన్నాడు బెనర్జీ.

"అలాగే! వెయిట్ చేస్తుంటాను" అంటూ ఫోన్ కట్ చేశాడు.

అరగంటకల్లా బెనర్జీ వచ్చి రూం తలుపు తట్టాడు. సుధాకర్ తలుపులు తీయగానే ప్రేమగా కౌగలించుకున్నాడు బెనర్జీ అతన్ని.

ఇద్దరూ కూర్చుని కాఫీలు సేవించారు.

"ఏమిటి బొంబాయి ప్రయాణం?"

"ఏముంది? మామూలే! ఒక చిన్న రహస్య సమావేశం

జరిగింది. దక్షిణ భారతంలోని కమీషనర్లను, ఐ.జీ.లను పిలిచారు. రిజర్వ్ బ్యాంక్ గవర్నరుతో మీటింగు జరిగింది."

"ఏమిటో హడావుడి!"

"రోజుకు దాదాపు రెండు లక్షల రూపాయల చొప్పున దొంగనోట్లు, అన్నీ ఇరవై రూపాయల కాగితాలు బ్యాంకుల్లో డిపాజిట్ అవుతున్నాయి. అవి దొంగనోట్లని రిజర్వు బ్యాంకుకు చేరితేగాని తెలీటంలేదు. అన్ని బ్యాంక్ లను హెచ్చరించడం జరిగింది. ఆ హెచ్చరిక చేసిన ఇరవైనాలుగు గంటల్లో ఆ నోట్లు రావడం ఆగిపోయిందట."

"ఐ.సీ. మరి కరెన్సీకోసం వాడే పేపరు ఎలా దొరికిందట ఆ ముఠాకు."

"బొంబాయి రేవులో దిగుమతవుతున్న బండిల్స్‌ను తెలివిగా కాజేశారు. దాన్ని గురించి వాకబు చేస్తున్నారు. హైదరాబాదులో దాదాపు రెండు లక్షల పైచిలుకు నోట్లు ప్రోగయినాయి. అందుకే నన్ను పిలిచారు" అన్నాడు బెనర్జీ.

"దొంగనోట్ల ముద్రణ ఎక్కడ జరుగుతుందో తెలిసిందా?" అడిగాడు సుధాకర్.

"లేదు!"

"ఎన్ని రోజులైంది ఈ నోట్లు రావడం మొదలెట్టి?"

"వారం దాటుతుందనుకుంటాను."

సుధాకర్ ఆలోచించడం మొదలుపెట్టాడు.

"అన్ని బ్యాంకుల్లోనూ మఫ్టీలో పోలీసు డిటెక్టివ్‌లను వుండే ఏర్పాటు చేశాను. అనుమానం రాగానే, అరెస్టు

చెయ్యమని ఆర్డర్సు కూడా ఇచ్చాను. కానీ ఇంతవరకూ ఇక్కడ ఒక్కడు కూడా చిక్కలేదు.''

''నీ దగ్గర శాంపిల్ నోటుందా?''

''ఆఁ!'' అంటూ జేబులోంచి తీసిచ్చాడు బెనర్జీ.

సుధాకర్ దాన్నందుకుని లైటు వెలుగులో చూశాడు. ఏ విధమైన తేడా దానికీ, అసలు నోటుకూ కనుపించలేదు.

''రిజర్వు బ్యాంకు ఎలా కనిపెట్టింది?''

''సీరియల్ నంబర్ల ద్వారా.''

''అంతకన్నా ఇందులో మరే లోపమూ లేదన్నమాట!''

''లేనట్లే చెప్పారు వాళ్ళు!''

''దీని వెనుకేదో పెద్ద ముఠా వుండివుండాలి! ఈ నోట్లు అచ్చువేసేందుకు అవసరమైన బ్లాకులు తయారుచెయ్యడం అంత సులభం కాదు. ఎంతో నేర్పు, అంతకన్నా ముఖ్యంగా అనుభవం వుండాలి ఆ మనిషికి'' అన్నాడు సుధాకర్.

''యస్, నువ్వు చెప్పింది అక్షరాలా నిజం!''

''ఆ కోణంనుంచి నరుక్కుపోతే సులభంగా ఈ ముఠాను పట్టుకోవచ్చు మీరు. ప్రయత్నించండి!'' అన్నాడు సుధాకర్.

''అంటే?'' అర్థంగాక అడిగాడు బెనర్జీ.

''ఏం లేదు! ఈ నోట్లు తయారుచేసేందుకు అవసరమైన బ్లాకులు కరెన్సీ ప్రింటింగ్ ప్రెస్‌లలోనే అమరుస్తుంది ప్రభుత్వం. గత కొద్ది మాసాల్లో, లేదా సంవత్సరాల్లో, ఎవరైనా పేరొందిన, ఎక్స్‌పర్టయిన బ్లాక్ మేకర్ను పని లోంచి తీసివెయ్యడం జరిగిందాని విచారించండి. ఆతర్వాత అలాంటిది జరిగివుంటే, ఆ వ్యక్తి ఎక్కడున్నాడు?

ఏమయినాడు? ఇప్పుడేం చేస్తున్నాడు? మొదలైన వివరాలు సేకరించండి. మీ పని సులభమవుతుంది. ఒకవేళ ఒకర్ని మించి ఎక్కువమందిని తీసివేసివుంటే అందర్ని గురించి విచారించండి'' అన్నాడు సుధాకర్.

''యూ ఆర్ జీనియస్. వెంటనే ఆదేశాలిస్తాను. ఇంతకూ నువ్వెందుకొచ్చినట్లు?'' అడిగాడు బెనర్జీ.

ఉమాపతి వురఫ్ ఉమాకాంతం గొడవ చెప్పాడు సుధాకర్. అంతా సావధానంగా విని ''అసాధ్యుడులాగున్నాడు. నావల్ల నీకేమన్నా సాయం కావల్సివుంటే చెప్పు! చేస్తాను!'' అన్నాడు బెనర్జీ.

''ప్రస్తుతం ఏం అవసరంలేదు. నేను విజయవాడ వెళ్ళి వస్తాను మద్రాసు వెళ్ళేముందు కలుసుకుంటాను'' అన్నాడు సుధాకర్.

''ఓ.కే.'' అంటూ సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు బెనర్జీ.

## 5

ఆ రాత్రి సూపర్ డీలక్స్ బస్‌లో విజయవాడకు ప్రయాణమయినాడు సుధాకర్. కిటికీ వారగా కూర్చుని సిగరెట్లు తగలేస్తూ కాలక్షేపం చెయ్యసాగాడు.

ఉమాపతి వురఫ్ ఉమాకాంతమే అతని ఆలోచనలు నిండుకున్నాడు. ఈపాటికి ఏ పెద్ద సిటీలోనో మరో నేరం చేస్తూనో, చెయ్యడానికి తగిన ప్రయత్నం చేస్తూనో వుండివుంటాడనిపించింది.

వేకువఝామున నాలుగున్నరకల్లా విజయవాడ చేరింది బస్సు.

దిగి హోటల్ నటరాజ్‌కు చేరుకుని రూం తీసు

కున్నాడు సుధాకర్. తెల్లారాక స్నానపానాదులు ముగించి, తన కవసరమైన మనిషికోసం వేట ప్రారంభించాడు.

జవహర్ ఆటో నగర్ ప్రాంతంలో ఆటోరిక్షా దిగి, టెలిఫోన్ డైరక్టరీలోనుండి రాసుకున్న అడ్రసు వెతక సాగాడు. అరగంట తర్వాత చిన్న బంగళా ముందున్న నెంబరు చూసుకున్నాడు. అదే తనకు కావలసిన ఇల్లని సరిచూసుకున్నాడు. టెలిఫోన్ వైర్లకేసి చూశాడు. రోడ్ లోంచి బిల్డింగుకు కనెక్టు చేస్తూ తీగలు కనుపించాయి.

వెళ్ళి తలుపు తట్టాడు.

వస్తాదులాంటి లావుపాటి మనిషి తలుపు తీశాడు. చారలబనీను వేసుకుని, గళ్ళలుంగీ కట్టుకొని వున్నాడు. నడుంకు మూడంగుళాల వెడల్పునున్న తోలుబెల్టుంది. మెళ్ళో తాయెత్తు వ్రేలాడుతూంది.

"ఎవరు కావాలి?" అడిగాడు సంస్కారహీనమైన క్రూర కంఠంతో.

"ఎవరున్నారు లోపల?"

"ఎవరుంటే నీకెందుకు? నీవెవరికోసం వచ్చావ్?"

"ఎవరున్నా వాళ్ళతో మాట్లాడేందుకు వచ్చాను. పోలీస్ డిపార్టుమెంటునుంచి" అన్నాడు సుధాకర్.

పోలీస్ అన్న పేరు వినగానే అతను కాస్త జంకిపోయినట్లు కనిపించింది.

"ఎవ్వరూ లేరు! అంతా వెళ్ళిపోయారు, ఉమామహేశ్వరి మాత్రం వుంది!" అన్నాడు అతను.

"ఆమెనే పిలువు!" అంటూ అక్కడే నిలబడ్డాడు.

వాడి వాలకం చూశాక, అతని జవాబులు విన్నాక,

అదో వ్యభిచారగృహమని అర్థమయింది సుధాకర్‌కు. ఉమామహేశ్వరి బహుశా దాన్ని నడుపుతూవుండాలను కున్నాడు.

"ఇక్కడ నిల్చున్నారేం అల్లుడుగారూ! లోనికి రండి!" అంటూ పలకరించింది.

ఆమెను తేరిపార చూశాడు. ముప్పయి సంవత్సరా లుంటాయి. ఎర్రగా, పొట్టిగా, బొద్దుగా పెటపెటలాడు తూంది. ముఖాన మాక్స్ పౌడరు రాసుకున్నట్లుంది. ప్రొద్దున్నే మేకప్ పైనుందనుకొన్నాడు.

ఆమెతోపాటు లోనికి వెళ్ళాడు.

ఇద్దరూ కూర్చున్నారు.

"పగలు ఎవ్వరూ వుండరు సార్! కావాలంటే ఫోన్ చేసి పిలిపిస్తాను" అంది ఉమామహేశ్వరి.

"నువ్వున్నావుగా? చాలు!" అన్నాడు సుధాకర్.

"నేను వృత్తిలో లేను. కేవలం మేనేజిమెంటు మాత్రం చేస్తున్నాను."

"నాకు నీతోనే పని వుంది. మాట్లాడాలి! అంతకన్నా ఇంకేం లేదు" అన్నాడు సుధాకర్.

"చెప్పండి!" వెనక్కి వాలి అడిగింది.

"ఉమాపతి మళ్ళీ ఫోన్ చేశాడా?"

"ఉమాపతా?...అతనెవరు?" అర్థంకానట్లు అడిగింది.

"అలా తెలీనట్లు మొహంపెట్టకు. హైదరాబాదు బ్లూ డైమండ్‌నుంచి రెండుసార్లు, ఢిల్లీ హిల్టన్‌నుండి రెండు దఫాలు నీకు ఫోన్ చేసిన ఉమాపతి వురఫ్ ఉమాకాంతం సంగతి నేనడిగేది?"

"అతనా? అతని పేరు అది కాదు."

"మరి?"

"సారధి. నన్ను ప్రేమించాడు. పెళ్ళాడమన్నాడు. అతనికి డబ్బులేదు. నిరాకరించాను. సంపాదించుకొచ్చి పెళ్ళాడుతానన్నాడు. పది లక్షలు సంపాదించుక రమ్మన్నాను. అప్పుడప్పుడు ఫోన్ చేసి త్వరలో వస్తున్నానని చెపుతూంటాడు."

"ఏం చేస్తున్నాడో తెలుసా?"

"తెలీదు. వ్యాపారం చేస్తున్నానన్నాడు."

"దొంగతనాలు, దోపిడీలు చేస్తున్నాడు. అతనెక్కడుందీ నాకు కావాలి! ఆఖరుదఫా ఎక్కడ్నుంచి ఫోన్ చేశాడు? ఎప్పుడు ఫోన్ చేశాడు? నిజం చెప్పు. లేకుంటే నిన్ను అరెస్టుచేసి జైలు కటకటాల వెనుక తోయిస్తాను!" అన్నాడు కోపంగా సుధాకర్.

"నాల్రోజులయింది. కలకత్తానుంచి ఫోన్ చేశాడు."

"ఎక్కడున్నాడు కలకత్తాలో?"

"గ్రాండ్ హోటల్‌లో వున్నాడు."

"గుడ్. అతనికోసం ఎదురుచూస్తూ, ఈ వ్యాపారం నడుపుతూ కూడా నువ్వు పవిత్రంగా వున్నావా?" అడిగాడు సుధాకర్ లేస్తూ.

"ఒక విధంగా అంతేననుకోండి!"

"అతను ఇక్కడ వస్తున్నట్లు తెలియగానే పోలీసులకు ఫోన్ చేసి చెప్పాలి."

"తప్పకుండా!" అంది ఉమామహేశ్వరి.

సుధాకర్ వెలుపలికొచ్చి తిన్నగా హోటల్ చేరుకున్నాడు. కలకత్తాకు ఫోన్ చేసి గ్రాండ్ హోటల్‌లో ఉమ అన్న రెండక్షరాల పేరు వెనుక ఏ పదాలతోనున్న

మనిషయినాసరే, చెయ్యి జారిపోకుండా చూసుండమనీ, తను వెంటనే విమానంలో వస్తున్నాననీ, పోలీస్ డిపార్ట్‌మెంటుకు చెప్పాడు. వాళ్ళు సరేనన్నారు.

లోకల్ యస్.పి.ని కలిసి, ఉమామహేశ్వరి ఫోన్ ట్యాప్ చేయించే ఏర్పాట్లు చేశాడు. ఏదైనా వార్త తెలీగానే బెవర్జీకి చేర్చమన్నాడు. అతను అలాగే చేస్తానన్నాడు.

# 6

డమ్‌డమ్‌నుంచి తిన్నగా పోలీస్ కమీషనరు ఆఫీసుకు వెళ్ళాడు సుధాకర్.

ఉమానాథ్ అనే పేరుతో అక్కడ పదిహేను రోజులనుండి పనిచేసిన వ్యక్తి అంతకు ముందురోజే ఖాళీ చేసి వెళ్ళినట్లు తెలిసిందని చెప్పాడు కమీషనర్.

పిట్ట చిక్కినట్లే చిక్కి ఎగిరిపోయినందుకు కాస్త నిరాశపడ్డాడు సుధాకర్.

టాక్సీ చేసుకుని గ్రాండ్ హోటల్ చేరుకున్నాడు.

ఉమానాథ్ గురించిన వివరాలకోసం ప్రయత్నించాడు. రూం బాయ్ అతన్ని వర్ణించి చెప్పాడు. అంతకుముందు ఈశ్వరరావు, డేవిడ్ చెప్పిన వివరాలతో సరిపోలింది అతని వర్ణన. తాను వెంటాడుతున్నదతనేనన్న విషయం రూఢిగా తెలిసింది సుధాకర్‌కు.

కానీ కలకత్తాలో ఎవర్ని బోల్తాకొట్టించాడో అర్థం కావటంలేదు. అంతదాకా అతన్ని గురించి పోలీసులకు ఏ విధమైన కంప్లెయింటు రాలేదని కూడా తెలిసింది. మోసపోయిన వ్యక్తికే ఇంకా ఆ విషయం అర్థంకాలేదేమోననుకున్నాడు.

రిసెప్షనులో నిల్చుని, రిజిస్టరులో ఉమానాథ్ చేసిన సంతకాన్ని పరిశీలనగా చూస్తున్న సుధాకర్‌కు ప్రక్కనే వచ్చి నిల్చున్న సూటువాలా అడుగుతున్న ప్రశ్న వింతగా తోచింది. కౌంటర్‌లోని క్లర్కును "త్రిబుల్ త్రీ రూంలో దిగిన మిస్టర్ ఉమానాథ్, చేర్‌మెన్ ఆఫ్ నేషనల్ మాన్యుమెంట్స్, ఎప్పుడొస్తారో తెలుసా?" అడిగాడతను.

"తెలీదండీ!" చెప్పాడు క్లర్కు.

"బహుశా ఈవేళ రావచ్చు. వారికి ఒక రూం రిజర్వ్ చేసి వుంచండి" అన్నాడతను.

సుధాకర్ రిసెప్షనులోకి రిజిస్టర్ను తోసి "నా పేరు సుధాకర్. మద్రాసునుండి వచ్చాను. నేను గూడా ఉమానాథ్ కోసమే చూస్తున్నాను" అన్నాను.

"ఇక్కడే దిగారా?" అడిగాడతను.

"లేదు! సీ వ్యూలో వున్నాను" అన్నాడు సుధాకర్.

"అతనితో ఏమైనా ముఖ్యమైన పనా?"

"చాలా అవసరమైన పని వుంది. వెంట తీసుకెళ్ళాలని వచ్చాను. మీ రెవరు? ఏం చేస్తుంటారో తెలుసుకోవచ్చా?"

"నా పేరు గోయల్. స్క్రాప్ ఐరన్‌లో నన్ను మించిన పెద్ద వ్యాపారి మరెవ్వరూ లేరు" అన్నాడు గోయల్.

"ఉమానాథ్ ఎలా తెలుసు?"

"ఇంతకుముందు తెలీదు. ఈ మధ్యే తెలుసుకున్నాను."

"ఎలా?" అడిగాడు ఉత్సాహంగా సుధాకర్.

"అది చాలా రహస్యమైన విషయమనుకోండి. అయినా

మీరు వారి స్నేహితులంటున్నారు గాబట్టి చెపుతాను. అదీగాక పని పూర్తయిపోయిందిగూడా. అందువల్ల పది మందికీ తెలిసినా ఫరవాలేదు!'' అన్నాడు గోయల్ రెస్టా రెంటువేపు నడుస్తూ.

ఇద్దరూ ఒకమూలగా కూర్చున్నారు.

''మిస్టర్ సుధాకర్! మీకు కుతుబ్‌మీనార్ తెలుసా?''

''తెలుసు.''

''అది ఈమధ్య తుప్పుపట్టి, పాడయిపోయింది. ఒక వేపుకు వొంగిపోయిందిగూడా. ఇన్నేళ్ళు వానకు తడిసి, ఎండకు ఎండినందువల్ల, రిపేరు చేసేందుకు వీలుకాని పగుళ్లు ఏర్పడ్డాయి అందులో.ఆ విషయంగురించి నెలరోజులక్రితం, గవర్నమెంటు పెద్ద ఆర్టికల్ కూడా ప్రచురించింది. దాన్ని రెండుకోట్లు ఖర్చుపెట్టి బాగుచెయ్యడమో, లేక పాత ఇనుముక్రింద అమ్మివెయ్యడమో చేయవలసిన సమయం ఆసన్నమైందని.''

సుధాకర్ విషయం వింతగానూ, విచిత్రంగానూ వుంది.

''నా రొట్టె విరిగి నేతిలో పడింది! నాకు జపాన్‌తో వ్యాపారం వుంది. వాళ్ళకు పదివేల టన్నులు ఐరన్ స్క్రాప్ ఎక్స్‌పోర్ట్ చెయ్యాలి. నా దగ్గర అంత లేదు. ఉన్నట్టుండి కుతుబ్‌మీనార్ పాతఇనుము క్రింద కొనేందుకు వీలుగా నాకు నేషనల్ మాన్యుమెంట్సునుంచి లిమిటెడ్ టెండరు వచ్చింది. అది నలుగురికి మాత్రమే పంపారు. నేను దాన్ని పూర్తిచేసి పంపేలోగా, చేర్మెన్ ఉమానాథ్ కలకత్తాకు వచ్చారు. అతని సెక్రెటరీ నాకు ఫోన్ చేశాడు. వెళ్ళి కలుసుకున్నాను. ఈ కాంట్రాక్టు నాకు వచ్చేట్లు చేస్తానన్నాడు. టన్నుకు ఏ రేటు కోట్

చెయ్యవలసిందీ చెప్పాడు. మొత్తం ముప్ఫయి లక్షలు లాభం రావచ్చని చెప్పాను. తన వాటాగా రెండు లక్షలు అడ్వాన్సుగా తెచ్చి యివ్వమన్నాడు. వెంటనే తెచ్చి ఇచ్చాను. టెండర్ కూడా ఫిలప్ చేసి ఇమ్మన్నాడు. ఇచ్చాను. తీసుకుని వెళ్ళి, తన ఆఫీసర్లతో సహా వచ్చి, ప్రభుత్వం ఇచ్చే గడువులోగా, కుతుబ్ మీనార్‌ను పాత ఇనుము క్రింద తీసుకొని పోగల మెషనరీ ఉందో లేదో చెక్ చేసి ఆర్డరు ఇస్తానన్నాడు. అంతా సవ్యంగా జరిగితే మరో మూడు లక్షలు యిస్తానన్నాను. ఆయన వద్దన్నారు'' అన్నాడు గోయల్.

కుతుబ్ మీనార్‌ను కొన్న గోయల్‌ను చూచి నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాలేదు సుధాకర్‌కు.

ఎంత సులభంగా, ఉమాపతి ఉరఫ్, ఉమాకాంతం ఉరఫ్ ఉమానాథ్ గోయల్‌ను బోల్తా కొట్టించాడో అర్థం చేసుకున్నాక, అతని తెలివితేటల పైకన్నా, అతనికి చిక్కిన, వివేకహీనుల ధనదాహం అర్థమయిపోయింది సుధాకర్‌కు. ఇలాంటి నీచులున్నంత కాలం ఉమాపతికి ఢోకా లేదనిపించింది.

అసలు బోర్డ్ ఆఫ్ నేషనల్ మాన్యుమెంట్స్ అనేది వున్నట్లు తను ఎప్పుడూ వినలేదు. దానికో చైర్‌మెన్‌ను కూడా తయారుచేసిన ఉమాపతి, ఉద్దండపిండం. అతనికి ప్రభుత్వం ఏ 'పద్మశ్రీ' బిరుదమో ఇచ్చి గౌరవించినా తప్పుపట్టరెవ్వరూ.

''మిస్టర్ గోయల్! నా పేరు సుధాకర్. ప్రైవేట్ డిటెక్టివ్‌ని. మారుపేర్లు పెట్టుకొని మీలాంటి వాళ్ళను

పెద్ద ఎత్తున మోసం చేస్తున్న సారధి ఉరఫ్ ఉమానాథ్‌ను పట్టుకోవాలని వచ్చాను. నేను చేరుకునే లోగానే చెయ్యి దాటిపోయాడు. అతను తిరిగిరావటం కల్ల. ఒకవేళ వస్తే ఎలాగైనా నా దగ్గరకు తీసుకురండి!" అన్నాడు సుధాకర్.

ఆ మాటలకు గోయల్ తెల్లబోయాడు. మొఖం నల్లగా బొగ్గులా మాడిపోయింది.

"ఈ ఉమానాథ్ నేరస్థుడా? ఛైర్‌మెన్ కాదా?"

"అయితే తనదగ్గరకు నిన్ను రప్పించుకోక నీ దగ్గర కెందుకొస్తాడు. ఇంత వ్యాపారం చేసేవాడివి ఆ మాత్రం అర్థంగాలేదా?"

"ఆ అనుమానం వచ్చింది. అడిగాను. అక్కడికొస్తే అసలు పని అభాసమవుతుందని చెప్పాడు. గవర్నమెంటు ముద్రలున్న కాగితాలు చూపించాడు. టెండరు పిలిచి అమ్మమని మినిస్టరు రాసిన కోడింగు కూడా చూపించాడు ఫైల్లో."

"అతను ఎంతకైనా తగినవాడు. నే చెప్పింది మరచిపోకు" అంటూ అక్కడ్నుంచి బయలుదేరాడు సుధాకర్ హోటల్‌కు.

ఉమానాథ్ కోసం కలకత్తాలోని పోలీసులు వెతకటం ప్రారంభించారు.

రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఫోన్ మ్రోగింది. హైదరాబాద్ నుండి వచ్చింది కాల్.

పోలీస్ కమీషనర్ బెనర్జీ వెంటనే హైదరాబాదు రమ్మనీ, అర్జంటుగా మాట్లాడాలనీ, క్రొత్త ఆచూకీలు తెలిశాయని చెప్పాడు ఫోన్లో సుధాకర్‌కు.

ఉదయం ఆరుగంటల ఫ్లైట్‌లో హైదరాబాదు చేరు

కున్నాడు సుధాకర్. తిన్నగా కమీషనర్ ఆఫీసుకు వెళ్ళాడు.

"నీ కోసమే చూస్తున్నాను!" అన్నాడు బెనర్జీ.

"ఏమిటి విశేషాలు?"

"నువ్వు చెప్పిన ప్రకారం పరిశోధన సాగించాం. నాసిక్ ప్రెస్ ఇరవై సంవత్సరాలనుండి బ్లాక్ మేకింగ్ సెక్షను ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న కాశీరాం, జీతాలు ఎక్కువ కావాలని, స్ట్రయిక్ చేయించేందుకు ప్రయత్నించాడట. అతన్ని మేనేజిమెంటు డిస్‌మిస్ చేసింది. అతను తిన్నగా విజయవాడ వచ్చినట్లు, ఉమామహేశ్వరి అనే బ్రోతల్ హవుస్ నడిపే స్త్రీని కలుసుకున్నట్లు తెలిసింది. అక్కడ్నుంచి అతను ఎటుపోయిందీ తెలీలేదు.

పోలీసులు అతని ఫోటో పట్టుకుని గాలించారు దేశమంతా. బొంబాయిలోని అంధేరిలో ఒక చిన్న గదిలో, ఏడో అంతస్తులో మకాంచేసి వున్నాడు. అతన్ని పట్టుకున్నారు. అతనిదగ్గర బ్లాకులుచేసే రకరకాల పనిముట్లు వున్నాయి. దాదాపు లక్షల రూపాయల పైచిలుకు దొంగనోట్లు కూడా చిక్కాయి. నిన్న సాయంత్రం ఇక్కడకు తీసుకొచ్చాం. చూస్తావా?" అడిగాడు కమీషనర్.

ఉమామహేశ్వరి పేరు చెప్పగానే సుధాకర్‌కు ఆ కేసులో ఇంటరెస్టు ఎక్కువయింది. ఉమాకాంతం ప్రియురాలు ఆమె. అతనే కాశీరాంను కూడా దొంగనోట్లు తయారీకి ప్రేరేపించి వుండవచ్చు ననుకున్నాడు.

ఇద్దరూ కారెక్కి ముషీరాబాదు జైలు కెళ్ళారు.

కాశీరాం సెల్‌లో మూలగా కూర్చుని వున్నాడు తల పట్టుకుని.

"మిస్టర్ కాశీరాం! ఈ ముఠాలోని మిగిలిన వాళ్ళెవరు?" అడిగాడు సుధాకర్.

"నాకు తెలీదు. బ్లాకులు చెయ్యడం నా పని. వాట్ని నా స్నేహితుడు ఉమాశంకరం చెప్పినవాళ్ళ అడ్రసుకు పంపటంతో నా బాధ్యత తీరిపోతుంది. అంతే!"

"ఆ ఉమాశంకరం ఎక్కడున్నాడు?"

"దేశమంతా తిరుగుతుంటాడు. అవసరమైనప్పుడల్లా వచ్చిపోతుంటాడు."

"అతనెలా వుంటాడు?"

కాశీరాం వివరించి చెప్పాడు ఉమాశంకరంను.

"ఉమాశంకరంకు ఉమామహేశ్వరికి సంబంధం వుందా?"

"ఉంది. అతను ఎక్కడుందీ ఆమెకు తెలుస్తుంటుంది" అన్నాడు కాశీరాం.

"అతని ఫోటో ఏదన్నా వుందా?"

"లేదు!" అన్నాడు కాశీరాం.

"నువ్వింతవరకు ఎన్ని సెట్లు బ్లాకులు చేశావ్?"

"ఆరు!"

"అన్ని ఇరవై రూపాయలవేనా?"

"ఆఁ!"

"నువ్వు పంపిన అడ్రసులు వున్నాయా?"

"ఉన్నాయి. వాళ్ళకు పోస్టుద్వారా పంపాను. పార్శిలు ముట్టినట్లు వచ్చిన తిరుగు రశీదులున్నాయి నా గదిలో" అన్నాడు కాశీరాం.

"ఒక్కో సెట్టుకు ఎంత ఛార్జి చేస్తారు?"

"నాకు తెలీదు! నాకుమాత్రం యాభయివేలు ఇస్తా

నన్నాడు ఉమాశంకరం. ముందు పెట్టుబడి క్రింద లక్ష రూపాయ లిచ్చాడు. వాటితో కావలసిన ఎక్విప్ మెంటు కొన్నాను" అన్నాడు కాశీరాం.

"నీ గదిలో దొరికిన దొంగ డబ్బు ఎక్కడిది?"

"ఒక క్లయింటు పంపాడు. ఒక్కో సెట్ ఖరీదు ఎంతో తెలీకున్నా అతనికి చేరిన సెట్ కు గానూ, ఒప్పుకున్న డబ్బిదని చెప్పి తన మనిషిద్వారా పంపాడు."

"అది దొంగనోట్ల కట్టలని తెలుసా?"

"తెలుసు! అందుకే ఆ విషయం ఉమామహేశ్వరికి ఫోన్ లో చెప్పాను. జరిగింది ఈపాటికి ఉమాశంకరంకు తెలుసుండాలి!" అన్నాడు కాశీరాం.

సుధాకర్ కు పరిస్థితి అర్థమయింది.

సారథి ఉరఫ్ ఉమాశంకరం, దొంగనోట్ల బ్లాకులు అమ్మి లక్షలు సంపాదించాలన్న ధ్యేయంతో కాశీరాంను లోబరుచుకున్నాడు. అతనికి పెట్టుబడి పెట్టడం కోసం రకరకాల నేరాలు చేశాడు. బ్లాకులుచేసి అమ్మారు. కానీ దానికి అనుకున్నట్లు డబ్బు అందలేదు. దాంతో సారథి కంగారుపడిపోయాడు.

అయితే సారథి భవిష్యత్ కార్యక్రమ మేమయి వుంటుందో ఊహించడం కష్టమయింది.

# 7

కారు విజయవాడ కేసి వేగంగా ప్రయాణం చేస్తూంది. బెనర్జీ సిగర్ కాలుస్తూ కూర్చున్నాడు. సుధాకర్ సిగరెట్ పైన సిగరెట్ వెలిగించి దమ్ము లాగుతున్నాడు.

విజయవాడనుండి పోలీసులు సమాచారం పంపారు. ఈ రాత్రికి వచ్చి కలుసుకుంటానని సారథి ఉమామహేరు

శ్వరికి ఫోన్ చేశాడు. ఎక్కణ్ణుంచి చేసిందీ తెలీలేదు. ఆమె ఇంటిచుట్టూ మఫ్టీలో పోలీసుల్ని కాపలా పెట్టారు. లోపలికి వెళ్ళిన ప్రతివాడూ వెలుపలికొచ్చాక తిన్నగా, పోలీసు వాన్ ఎక్కి వెళ్ళే ఏర్పాటు చేయించాడు బెనర్జీ.

“అతను నిజంగా వస్తాడంటావా?” అడిగాడు బెనర్జీ.

“ఏమో? ఈ పాటికి కాశీరాం మనచేతుల్లో చిక్కినట్లు తెలిసి వుంటుంది. అతను మనకంతా చెప్పివుంటాడన్న అనుమానం కలిగిందంటే రాడు. నా ఊహప్రకారం అతనికి అలాంటి అనుమానం వుండివుంటుంది. అందుకే బొంబాయి వెళ్ళే ప్రయత్నం చెయ్యకుండా అసలు గొడవ ఏమిటో తెలుసుకుందామని విజయవాడకు ప్రయాణమై వస్తూవుండాలి!” అన్నాడు సుధాకర్.

“అతన్ని గుర్తుపట్టడ మెలా?”

“డేవిడ్‌ను, గోయల్‌నూ, ఈశ్వరరావును విజయవాడ రమ్మని వైర్ చేశాను. వాళ్ళనుకూడా ఉమామహేశ్వరి బ్రాతల్‌కు పంపుదాం! వాళ్ళటూ లోన వుంటారు. సారధి వచ్చాడంటే వాళ్ళే పట్టుకుంటారు” అన్నాడు సుధాకర్.

“మంచి ఐడియా?” అన్నాడు బెనర్జీ.

కారు విజయవాడ చేరింది. యస్. పి. వచ్చి కలుసుకున్నాడు. ఉమామహేశ్వరి యింట్లోకి యిప్పటికి యిద్దరు వెళ్ళారనీ, వాళ్ళిద్దరూ ఈ వూరివాళ్ళేననీ, తమకు తెలుసుననీ చెప్పాడు యస్. పి.

“అయితే! సారధి ఇంకా వచ్చివుండడు” అన్నాడు సుధాకర్.

సారధి క్లయింట్లు ముగ్గురూ వచ్చారు.

వాళ్ళకు ఏం చెయ్యవలసిందీ వివరంగా చెప్పాడు సుధాకర్. ఆ తర్వాత ముగ్గుర్నీ ఉమామహేశ్వరి ఇంటికి పంపాడు.

ఆ బంగళాకు దూరంగా ఒకచోట మాటువేసి కూర్చున్నారు సుధాకర్, బెనర్జీ. దగ్గర రివాల్వర్లు లోడ్ చేసి వుంచుకున్నారు.

అర్ధరాత్రి దాటింది. దూరంగా కుక్కలు మొరుగుతున్నాయి. డేవిడ్, గోయల్, ఈశ్వరరావు ముగ్గురూ, ఒకరితర్వాత ఒకరు ఇరవైనిముషాల తేడాతో ఉమామహేశ్వరి బ్రాతల్ హౌస్‌కు చేరుకున్నారు.

సైకిల్ రిక్షా ఒకటి రావడం కనుపించింది.

సుధాకర్ తలెత్తి చూశాడు. టాప్ వేసుంది. ముస్లిం స్త్రీలున్నట్లు, పరదా కట్టివుంది. రిక్షా తిన్నగా వెళ్ళి ఉమామహేశ్వరి ఇంటిముందాగింది.

పైనుంచి క్రిందదాకా నల్లటి ముసుగు వేసుకున్న ముస్లిం స్త్రీ దిగటం, లైటు వెలుగులో గమనించారు ఇద్దరూ.

"బ్రోతల్ లాగుంది!" అన్నాడు బెనర్జీ.

"ఆఁ! ఎక్కడెక్కడినుంచో వస్తున్నారు. డిమాండ్ ఎక్కువయింది గదూ! ఫోన్ చేసి పిలిపించి వుంటుంది" అన్నాడు సుధాకర్.

తెల్లవారటానికి మరో గంటమాత్రం వుంది.

డేవిడ్ వచ్చాడు.

"అతను రాలేదు సార్! నేను కిటికీతలుపు తీసి చూస్తూనేవున్నాను. నా వెంటవున్న ఆడమనిషి ఎవరికోసం అని పదేపదే అడుగుతూండి పోయింది. ఇంకా ఎవరన్నా మంచి అమ్మాయి దొరుకుతుందేమోనని అన్నాను.

మనం కాపు వేశామని తెలుసేమో? జాగ్రత్త పడ్డట్లున్నాడు" అన్నాడు డేవిడ్.

సుధాకర్ కది విచిత్రంగా తోచింది. సారధికి ఉమామహేశ్వరికీ వున్న ప్రణయానుబంధం అతనికి తెలుసు. వస్తానని ఫోన్ చేసిన మనిషి రాకుండా ఏమైపోయినట్లని ఆలోచించసాగాడు.

గోయల్ కూడా వచ్చాడు.

అతను డేవిడ్ చెప్పిందే చెప్పాడు.

ఆ తర్వాత ఐదు నిముషాలకు ఈశ్వరరావు వచ్చాడు. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి. అతనూ అంతకు ముందు ఇద్దరూ చెప్పినదాన్నే బలపరచాడు.

"అదృష్టవంతుడు. ఇక్కడికి రాకుండా బ్రతికి పోయాడు" అన్నాడు బెనర్జీ.

"మీ రిక్కడే వుండండి. నే నిప్పుడే వస్తాను" అంటూ ఉమామహేశ్వరి బ్రోతల్ వైపు నడిచాడు.

పదినిముషాల తర్వాత, నల్లటి ముసుగులో వున్న ఆకారాన్ని లాక్కొని వెలుపలికొచ్చాడు.

అపాటికి అంతా అక్కడకు చేరారు.

"ఎవరామె?" అడిగాడు బెనర్జీ.

"ముసుగు తీస్తాను. మీరే చూసి చెప్పండి!" అంటూ ముసుగు తొలగించాడు.

"ఉమాపతి!" ఈశ్వరరావు గుడ్లు తేలవేసి అన్నాడు.

"ఉమాశంకరం!" డేవిడ్, నోరు వెళ్ళబెట్టి అరిచాడు.

"ఉమానాథ్!" గోయల్ పైకి దూకబోతున్నట్లు కేకపెట్టాడు.

"కాదు! సారధి!" అన్నాడు సుధాకర్.

"మీ కెలా అనుమానం వచ్చింది" అడిగాడు బెనర్జీ.

"కుతుబ్ మీనార్ని అమ్మినఘనుడు మామూలురూపంలో, వేషంలో వస్తాడని నాకు నమ్మకంలేదు. అందుకే రాత్రి వెళ్ళిన రిక్షా నా దృష్టిని ఆకర్షించింది. మీరంతా అతను లేడంటూంటే, ఓమారు వెళ్ళి ఆ ముస్లిం స్త్రీ వుందా, లేదా చూచివద్దామని వెళ్ళాను. సిగరెట్ త్రాగుతూ, తన ప్రియురాలిని వొళ్ళో కూర్చోపెట్టుకొని మాట్లాడుతున్నాడు. తక్కున పట్టుకున్నాను. రివాల్వరు తీశాడు. ఒక్క తన్ను తన్నాను కాలితో, అంతే పిట్టలా చిక్కిపోయాడు. ఇతన్ని మీకు అప్పగిస్తున్నాను. మిగిలినదంతా మీరు చూసుకోండి!" అన్నాడు సుధాకర్.

"థాంక్స్ ఎ లాట్!" అంటూ బెనర్జీ, సారధి చేతులకు బేడీలు తగిలించాడు.

—: ఐ పో యిం ది :—